ప్రజలకు చేరువైన పాలన

- సచివాలయాల వ్యవస్థే కారణం
- శరవేగంగా సచివాలయ భవనాల నిర్మాణం
- ప్రజలకు అందుబాటులో 546 పౌరసేవలు



సచివాలయ భవన పత్రాలను కార్యదర్శి ప్రసాద్‌కు అందజేస్తున్న ఈఈ నరేష్

పమిడిముక్కల: సచివాలయాల ఏర్పాటు, వలంటీర్ల నియామకంతో ప్రజలకు పరిపాలన చేరువైంది. ప్రతి సచివాలయానికి 11 మంది సిబ్బంది, 50 ఇళ్లకు ఒక వలంటీర్ చొప్పున నియమించారు. ప్రజలకు సర్టిఫికెట్లు, వివిధ పనుల నిమిత్తం మండల కార్యాలయాల చుట్టూ తిరిగే సమస్య తీరింది. గతంలో పంచాయతీ కార్యాలయాల్లో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు మాత్రమే ఇచ్చేవారు. ఏ పని కావాలన్నా మండల కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. ప్రస్తుతం సచివాలయాల్లో అన్ని రకాల సేవలు అందుతుండటంతో ప్రజలకు ఇబ్బందులు తొలగిపోయాయి. ఇంటి ముంగిటకే పథకాలు, సేవలు అందుతున్నాయి.

వివిధ దశల్లో 14 భవనాలు..

మండలంలో 17 సచివాలయాలు ఉన్నాయి. పరిపాలనా సౌలభ్యం కొరకు ప్రతి సచివాలయానికి, ఆర్బీకే, హెల్త్ సెంటర్ మంజూరు చేశారు. మూడింటికి కలిపి రూ.79.05 లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారు. మొత్తం 17 సచివాలయాల భవనాలకు గాను 14 భవనాల నిర్మాణ పనులు ప్రారంభించారు. అలీనఖీపాలెం, ఐనంపూడి, కపిలేశ్వరపురం-2 సచివాలయాల పనులు ప్రారంభం కాలేదు. మంత్రివాడ, అగినపర్రుల్లో మాత్రం భవన నిర్మాణాలు పూర్తి చేసి ప్రారంభించారు. లంకపల్లి, తాడంకి, గురజాడ, పమిడిముక్కల, ఐనపూరు గ్రామాల్లో సచివాలయాల నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. హనుమంతపురం, చోరగుడి, మంటాడ సచివాలయాలు నిర్మాణ దశలో ఉన్నాయి. లంకపల్లిలో సచివాలయం, ఆర్బీకే, హెల్త్ సెంటర్ పనులు పూర్తయినాయి. ఐనపూరులో సచివాలయంతో పాటు ఆర్బీకే నిర్మాణం పూర్తి చేశారు. మిగిలినవి వచ్చే నెల 30 లోపు పూర్తి చేసేదుకు చర్యలు తీసుకొంటున్నారు.

అందించే సేవలు..

సచివాలయాల్లో 546 రకాల సేవలు అందిస్తున్నారు. ముఖ్యంగా జనన, మరణ, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్నారు. ఆధార్, కరెంట్ సర్వీస్, విద్యుత్ బిల్లులు, ఉపాధి పథకం జాబ్ కార్డులు, రైస్ కార్డులు, కొత్త పింఛన్లు అందజేస్తున్నారు. వైఎస్సార్ పింఛను కానుక, ఆరోగ్యశ్రీ, రైతు భరోసా, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన, జగనన్న అమ్మ ఒడి, కాపు నేస్తం, జగనన్న తోడు, వైఎస్సార్ చేయూత, వాహనమిత్ర, ఫీజురీయింబర్స్‌మెంట్, పేదలందరికీ ఇళ్లు, కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాలను సచివాలయాల ద్వారా అందజేస్తున్నారు. రెవెన్యూ సేవలు గతంలో మీ సేవా కేంద్రాల ద్వారా అందించేవారు, ప్రస్తుతం ఈ సేవలన్నీ సచివాయాల ద్వారా అందజేస్తుండటంతో ప్రజల చెంతకు పరిపాలన చేరువైంది. గతంలోలా మండల కేంద్రాలకు వెళ్లి గంటలు, రోజులు వేచి చూసే పరిస్థితి లేకుండా పోయింది.

విప్లవాత్మక మార్పులు..



సచివాలయాల ఏర్పాటుతో పరిపాలనలో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లు కలిసి పనిచేస్తూ సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నారు. ఇది ప్రజల మేలుకోరే ప్రభుత్వం. గతంలో పనులు కావాలంటే మండల కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. ప్రస్తుతం సచివాలయాల ద్వారా ప్రజలకు కావాల్సిన సేవలన్నీ అందుతున్నాయి.

–ఆముదాలపల్లి సుబ్రమణ్యం, సర్పంచ్, మామిళ్లపల్లి

శరవేగంగా సచివాలయ భవన నిర్మాణం..



మండలంలో 12 సచివాలయ భవన నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. పరిపాలనా సౌలభ్యం కొరకు సచివాలయం, ఆర్బీకే, హెల్త్ సెంటర్లు నిర్మిస్తున్నాం. ఒక్కో సచివాలయ నిర్మాణానికి రూ.40 లక్షలు, ఆర్బీకే నిర్మాణానికి రూ.21.08 లక్షలు, హెల్త్ సెంటర్‌కు రూ.17.50 లక్షలు వంతున నిధులు మంజూరయ్యాయి. అక్టోబర్ 30వ తేదీలోపు నాణ్యతా ప్రమాణాలతో భవన నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రారంభించేందుకు చర్యలు తీసుకొంటున్నాం.

–శరాబందిరాజు, పీఆర్ ఏఈ

సేవలందిస్తున్నాం...



ప్రభుత్వ పథకాలు, సచివాలయ సేవలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. పథకాలకు అర్హులను గుర్తించి సచివాలయం ద్వారా దరఖాస్తు చేయించి, పథకాలు అందేలా చర్యలు తీసుకొంటున్నాం. అవసరమైన సర్టిఫికెట్ల కొరకు దరఖాస్తు చేయించి, ఇంటికి తీసుకెళ్లి అందజేస్తున్నాం. పెన్షన్ల పంపిణీతో పాటు అన్ని రకాల సేవలందిస్తున్నాం.

–బొల్లా అమ్మాజీ, వలంటీర్, గుర్రాల్లంక

జిల్లా స్థాయి యోగా పోటీలకు ఎంపిక


విజేతలైన విద్యార్థులతో హెచ్‌ఎం ఇందిరారాణి, పీడీలు

పామర్రు: జిల్లా స్థాయిలో త్వరలో జరగబోయే యోగా పోటీలకు విద్యార్థుల ఎంపిక కార్యక్రమం స్థానిక కంచర్ల రామారావు జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో అన్ని జెడ్పీహైస్కూల్‌లకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా నియోజకవర్గ పీడీ అసోసియేషన్ కన్వీనర్ అప్పికట్ల జవహర్‌బాబు మాట్లాడుతూ యోగాలో ఒక్కొక్క విభాగంలో ఐదు రకాల అంశాలలో విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. అండర్-14 బాలుర, బాలికల విభాగంలో 10 మందిని ఎంపిక చేశామన్నారు. అండర్-17 విభాగం బాలుర, బాలికల నుంచి 10 మందిని ఎంపిక చేశారు. విజేతలు జిల్లా స్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారు. అనంతరం విజేతలైన విద్యార్థులను హైస్కూల్ హెచ్‌ఎం ఏ.ఇందిరారాణి అభినందించారు. ఈకార్యక్రమంలో పీడీలు జీ మురళీ, రవికిషోర్, దేవిరెడ్డి ఆనంద్‌రెడ్డి, పీఈటీ ఎం.గ్లాడిసన్, విద్యార్థులు పాల్గొన్నారు.

వాలీబాల్ రాష్ట్ర జట్టుకు ఎంపిక


విద్యార్థి వి. ఆర్య

గుడ్లవల్లేరు: వాలీబాల్ రాష్ట్ర స్థాయి జట్టుకు విన్నకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి వార ఆర్య ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని హైస్కూల్ హెచ్‌ఎం ఎం.విజయ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో గురువారం నిర్వహించిన వాలీబాల్ బాలుర అండర్-14 విభాగంలో తలపడి ఎంపికైనట్లు చెప్పారు. విజేతతో పాటు శిక్షణ ఇచ్చిన పీడీ వి.మృత్యుంజయను పాధ్యాయులు అభినందించారు. ఆర్య త్వరలోరాష్ట్రస్థాయిలో జరగబోయే పోటీలో పాల్గొంటారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

వెంట్రప్రగడ (పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడ గ్రామంలో శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించిస్తున్నట్లు ఎంపీపీ గోగం సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. అన్ని శాఖలా అధికారులు పూర్తి స్థాయి సమాచారంతో హాజరకావాలని కోరారు.

అన్నసమారాధన

ముదినేపల్లి రూరల్: స్థానిక బంటుమిల్లి రోడ్డులోని పెయ్యేరు వైఎస్సార్ కాలనీలో వినాయకచవితి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. ఈ సమారాధన కార్యక్రమాన్ని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ ప్రారంభించారు. తొలుత గణపతి విగ్రహానికి ఆయన పూజలు చేశారు. మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అల్లాభక్షు, వైస్ఎంపీపీ రాచూరి రాధా, వైఎస్సార్ సీపీ నాయకులు మోత్రు ఏసుబాబు, గంటా కోటేశ్వరరావు, కోమటి విష్ణువర్ధన్, కొల్లి నాని, బత్తిన కిషోర్, రంగిశెట్టి కొండా, తాడంకి రాజేష్, దివి సతీష్ పాల్గొన్నారు.

పోషకాహారంతో తల్లీబిడ్డలకు ఆరోగ్యం


ఇంగిలిపాకలంకలో మాట్లాడుతున్న సీడీపీఓ ఆనంద్, జెడ్పీటీసీ విజయనిర్మల

కైకలూరు: సంపూర్ణ పోషకాహారం తీసుకోవడం వల్ల తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీవో బి.ఆనంద్ చెప్పారు. గోపవరం అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సీడీపీవో మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషక విలువలతో కూడిన కిట్లను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సర్పంచ్ ఉలిసి వసంతకుమారి మాట్లాడుతూ మహిళల సంపూర్ణ ఆరోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ లావణ్య, కార్యకర్త పి.సుజాత, హెల్పర్ మాధవి పాల్గొన్నారు.

మండవల్లి: మండలంలోని ఇంగిలిపాకలంక అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గర్భిణులు, బాలింతల్లో పోషకాహార విలువలు పెంపుదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని అందరూ తీసుకోవాలని సీడీపీఓ ఆనంద్ కోరారు. ఈ నెల 30 వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. సెక్టార్ సూపర్‌వైజర్ కల్పవల్లి, జెడ్పీటీసీ ముంగర విజయనిర్మల, ఎంపీటీసీ మోరు వెంకటరమణ, సర్పంచ్ ఘంటసాల రత్నకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, బీడీపీ జ్యోతి, ఎస్.అరుణ, జ్యోతి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

దాతల సహకారం అభినందనీయం


ఫిక్సిడ్ డిపాజిట్ బాండును హెచ్‌ఎం కిషోర్‌బాబుకు అందజేస్తున్న దాత వెలగపూడి కిషోర్

వెంట్రప్రగడ(పెదపారుపూడి): విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించేందుకు అవసరమైన బహుమతులకోసం రూ.50 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయడం అభినందనీయమని జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కె.కిషోర్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని వెంట్రప్రగడ గ్రామానికి చెందిన వెలగపూడి చంద్రశేఖర్ జ్ఞాపకార్థం వారి మనమడు వెలగపూడి కిషోర్ రూ.50 వేలు నగదును బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి హెచ్‌ఎంకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఈ నగదుతో వచ్చిన వడ్డీతో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. గత సంవత్సరం పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ప్రమోద్‌కు ఇంటర్ ప్రథమ సంవత్సరం కాలేజీ ఫీజు నియమిత్తం దాత రూ.30 వేలు నగదును కూడా అదనంగా అందించంటం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో చలసాని రమేష్ చౌదరి (చంటి) తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు(కలిదిండి): విద్యుత్ సబ్‌స్టేషన్ల మరమ్మతుల నిమిత్తం కలిదిండి మండలంలో శనివారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు గుడివాడ విద్యుత్‌శాఖ ఈఈ రామకృష్ణ శుక్రవారం చెప్పారు. సబ్‌స్టేషన్ల పరిధిలోని 33 కేవీ లైన్లుకు అత్యవసర మరమ్మతులు చేయనున్నామన్నారు.

వాసవీక్లబ్ సేవలు అభినందనీయం

కైకలూరు(కలిదిండి): సమాజ సేవలో వాసవీ క్లబ్ కలిదిండి గోల్డ్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. తాడినాడ చినరామాలయం వద్ద వాసవీ క్లబ్ కలిదిండి గోల్డ్ అధ్యక్షుడు నూకల శ్యామలరావు గుప్తా తల్లిదండ్రుల జ్ఞాపకార్థం గ్రామానికి ఫ్రీజర్ బాక్సును వితరణగా శుక్రవారం అందించారు. ముఖ్య అతిథిగా జిల్లా వాసవీ క్లబ్ గవర్నర్ మాజేటి రామచంద్రరావు హాజరయ్యారు. పాఠశాలకు పోడియం బెంచ్, పది మంది పేదలకు వాసవీ క్లబ్ తరఫున దుప్పట్లు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ కూసంపూడి కనక దుర్గారాణి, సర్పంచ్ తాడి శ్రీనివాసరావు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ తాడినాడ బాబు, జిల్లా క్లబ్ నాయకులు ఆలపాటి ప్రభాకరావు, డి. సత్యనారాయణ, కొత్త గణేష్ బాబు, చిట్టూరి శ్రీనివారావు, గాదె మోహన్ బాబు, గోళ్ళ నాగేశ్వరావు, బచ్చు సుదర్శన్, కొల్లిపర అనసూయ, చిన తాడినాడ సర్పంచ్ గండికోట ఏసుబాబు, యార్ల కృపారావు, చక్కా జగన్, గొంద్రాల సుబ్బయ్య, నీలి మాదవి, మానేపల్లి పద్మావతి, సాలన వసంతలక్ష్మి పాల్గొన్నారు.

ఈ క్రాప్, ఈకేవైసీ పూర్తి చేయాలి

మండవల్లి: ఈ క్రాప్, ఈకేవైసీ పూర్తి చేయాలని మండవల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు జి.వెంకటమణి పేర్కొన్నారు. ఎంఏవో కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయ సంచాలకులకు శుక్రవారం రివ్యూ సమావేశం నిర్వహించారు. అనంతరం క్షేత్ర పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వరిపైరులో ఆకుముడత, రెక్కల పురుగు నివారణకు వేపనూనె లీటరు నీటికి 5 ఎంఎల్ చొప్పున పిచికారీ చేయాలని సూచించారు. చేను గట్లను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. హబ్ మేనేజర్ గౌస్ బాషా, మండల వ్యవసాయాధికారి ఎస్‌కే జరీనా, ముదినేపల్లి, మండల్లి వీఏఏలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

మండవల్లి: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు మండలానికి చెందిన ఇరువురు విద్యార్థులు ఎంపికయ్యారు. మండవల్లికి చెందిన మేడేల్లి అమృత (9వ తరగతి), భైరవపట్నంకు చెందిన జి.రోహిత్ (7వ తరగతి) ఎంపికైనట్లు కరస్పాండెంట్ ఫాదర్ ప్రవీణ్ తెలిపారు. వీరు కైకలూరు హోలీ క్రాస్ ఇంగ్లిషు మీడియం హైస్కూల్లో చదువుతున్నారు. ప్రిన్సిపాల్ సిస్టర్ సెర్లీ, పీడీ బలే నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

తోట్లవల్లూరు: ఎస్సీ వర్గీకరణకు పార్లమెంటులో చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కోటా దానియేలు మాదిగ డిమాండ్ చేశారు. ఈ విషయమై శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ కుసుమకుమారికి ఆయన వినతి పత్రం అందజేశారు. ఎస్సీ వర్గీకరణకు అనుగుణంగా లేని పార్టీలను భవిష్యత్తులో గ్రామాల్లోకి రానివ్వమని దానియేలు అన్నారు. సామాజిక న్యాయం కోణంలో ఆలోచించి తమకు న్యాయం చేయాలని ఆయన కోరారు. ఎమ్మార్పీఎస్ నాయకులు వల్లూరు సుదర్శనరావు, సుధీర్, బాబూరావు, రాజేష్, వంశీ, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

మండవల్లి: మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజన పథకాన్ని సర్పంచ్ మెండా ఝాన్సీ పరిశీలించారు. సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పౌష్టికారంతో కూడిన పదార్థాలను భోజనంలో వడ్డించాలని ఆదేశించిందని తెలిపారు. వైఎస్సార్ సీపీ నేతలు మెండా సురేష్, హెచ్‌ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వలంటీర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

గుడివాడరూరల్: మండలంలోని రామనపూడి సచివాలయం పరిధిలోని తటివర్రు గ్రామ పంచాయతీ క్లస్టర్ నంబర్-సి9 వలంటరీ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో అనగాని వెంకటరమణ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకునే వారు 01-09-2023 నాటికి 18 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాల లోపు వయస్సు ఉండాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై గ్రామ నివాసి అయి ఉండాలని తెలిపారు. అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తారు. ఈనెల 27వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. 29న దరఖాస్తుల పరిశీలన, 30న ఇంటర్వ్యూలు, అదేరోజు ఎంపికైన వలంటీర్‌కు నియామకపత్రాలు ఇస్తామన్నారు.

వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని వినతి



పమిడిముక్కల: కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఎంఎస్పీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. తహసీల్దార్ రాజ్యలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా కో కన్వీనర్లు సిద్దిల జయరాజు, దొండపాటి డేవిడ్, నియోజకవర్గ కన్వీనర్ గంధ్రపు రాకేష్‌నాథ్, మండల కన్వీనర్ వేల్పూరి మధు తదితరులు పాల్గొన్నారు.

70 మందికి దుప్పట్ల పంపిణీ



గుడివాడ టౌన్: స్థానిక 31వ వార్డు మాజీ కౌన్సిలర్ వంగలపూడి కనకబాబు ఆధ్వర్యంలో 70 మంది చిన్నారులకు దుప్పట్లు, పుస్తకాలు పంపిణీ చేశారు. పట్టణంలోని నవజీవన్ బాలల భవన్‌కు చెందిన పేద విద్యార్థులకు విద్యను అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు కనకబాబు తెలిపారు. చిన్నారుల్లో ధైర్యాన్ని, నమ్మకాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం చిన్నారులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వీరిశెట్టి నరసింహారావు, వైఎస్సార్ సీపీ నాయకులు సింగిరెడ్డి గగారిన్, పిండి బాలు, వంగలపూడి లక్ష్మి, భాగ్య, బాల భవన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీ గణపతి హోమం



గుడివాడ టౌన్: స్థానిక పుల్లలపాడు వంతెన వద్ద బాలగణపతి స్వామివారి దేవాలయంలో శుక్రవారం లక్ష్మీ గణపతి హోమం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. అర్చకుడు స్వర్ణ శివరామకృష్ణ మాట్లాడుతూ లోక కల్యాణం, మానవాళి శ్రేయస్సు కొరకు లక్ష్మీ గణపతి హోమం నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కన్వీనర్ పి.దుర్గా మల్లేశ్వరరావు, పి.కోటేశ్వరరావు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'రుద్రం కోట' విజయవంతం కావాలి

గుడివాడ టౌన్: గుడివాడకు చెందిన కోనా రాము దర్శకత్వంలో నిర్మించబడిన రుద్రం కోట చిత్రం విజయవంతం కావాలని అభిమానులు కోరారు. శుక్రవారం స్థానిక నెక్స్ థియేటర్ వద్ద చిత్రం విడుదల సందర్భంగా అభిమానులు సంబరాలు చేశారు. అభిమానులు కేక్ కట్‌చేసి బాణసంచా కాల్చారు. చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలని, కళాకారులకు పుట్టినిల్లు అయిన గుడివాడకు చెందిన వ్యక్తి దర్శకత్వం వహించిన ఈ చిత్రం ప్రజలు ఆదరిస్తారని అభిమానులు అన్నారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు రాము, కోనా సత్యన్నారాయణ, సూర్యనారాయణ, సీహెచ్ విజయకుమార్, చినబాబు, నాగరాజు, కె.రాంబాబు, గణేష్, పెద ఎరికపాడు యూత్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న చవితి వేడుకలు


గుడివాడలో పూజలు నిర్వహిస్తున్న పెద్ది కిషోర్ దంపతులు


గుడివాడ విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో హిరణ్య గణపతి స్వామి


పూజలు చేస్తున్న బాడిగ దంపతులు


పామర్రులో 31 అడుగుల మట్టి వినాయకుడి విగ్రహానికి పూజలు


గుర్రాల్లంకలో గణపతికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

గుడివాడ టౌన్: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వర రావు (నాని) ఆధ్వర్యంలో గణపతి నవ రాత్రి మహోత్సవాలు శుక్రవారం కొనసాగాయి. వైఎస్సార్ సీపీ నాయకులు పెద్ది కిషోర్ దంపతులు పీటలపై కూర్చుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కె.ఆంజనేయ ప్రసాద్, చుండూరి శేఖర్, పి.కృష్ణ, గడ్డం కిషోర్ కుమార్, ఎస్.రామకృష్ణ, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా నిమజ్జనోత్సవం

పామర్రు: గణపతి నవరాత్రులలో భాగంగా ఐదో రోజు శుక్రవారం పలుచోట్ల వినాయక నిమజ్జనోత్సవాలు నిర్వహించారు. స్థానిక పుల్లేరు కాలువలో స్వామిని నిమజ్జనం చేశారు. గ్రామంలోని కోటిరెడ్డి పేటలోని వినాయక స్వామిని ఊరేగింపు నిర్వహించి అనంతరం స్థానిక కాలువలో స్వామిని నిమజ్జనం చేశారు.

గుడివాడరూరల్: మండలంలో చవితి వేడుకలు 5వ రోజు శుక్రవారం కొనసాగాయి. మండలంలోని రామనపూడి, బిళ్లపాడు, చిన ఎరుకపాడు, తటివర్రు, మోటూరు, వలివర్తిపాడు, లింగవరం, దొండపాడు, గుంటాకోడూరు, శేరీగొల్వేపల్లి, శేరీవేల్పూరు, చౌటపల్లి తదితర గ్రామాల్లో వినాయక చవితి వేడుకల్లో భాగంగా గణనాథుడికి భక్తులు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితులు విఘ్నేశ్వరునికి ప్రత్యేక అలంకరణలు చేసి పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు: వినాయక చవితి సందర్భంగా కౌతవరంలో శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకుడు బాడిగ నాని దంపతులు స్థానిక విఘ్నేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వేద మంత్రోచ్చరణ మధ్య స్వామి వారికి విశేషాభిషేకాలను వేద పండితుడు అంబా గౌతమేశ్వరరావు చేపట్టారు. భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

తోట్లవల్లూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రోడ్డులో ఏర్పాటు చేసిన మండపంలో వినాయకుడికి విశేషపూజలు జరుగుతున్నాయి. అర్చకుడు ప్రభాకరశర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాల్లో భక్తులు విరివిగా పాల్గొని పూజలు నిర్వహిస్తున్నారు.

పమిడిముక్కల: మండలంలో గుర్రాల్లంక గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పందిరిలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. 26వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం భారీ అన్న సంతర్పణ చేశారు. భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు.

పామర్రు: స్థానిక వాసవీ ఆర్యవైశ్య యువజన సంఘ సభ్యుల ఆధ్వర్యంలో వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో 31 అడుగులమట్టి వినాయకుడి విగ్రహానికి అర్చకుడు ముత్తేవి మాధవాచార్యులు పూజలు చేశారు. విజయవాడ వాస్తవ్యులు కొత్తమాసు రఘురామ్ జ్ఞాపకార్థం భార్య యశోధ, కుమార్తు కోడలు వంశీధర్, సరితల సౌజన్యంతో అన్న సమారాధన చేశారు. మండల పరిధిలోని జమీదగ్గుమిల్లిలో విఘ్నేశ్వర స్వామి మందిరంలో స్వామికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

మండవల్లి: మండలంలోని పలు గ్రామాల్లో గణపతి నవరాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం స్థానిక భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయం, వెలమపేట రామాలయం, స్టేషన్‌రోడ్డు కోదండ రామాలయం, శ్రీ కృష్ణాలయం, హైస్కూల్ సమీపంలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మండవల్లి, కానుకొల్లు, లింగాల, పెరికెగూడెం, అయ్యవారిరుద్రవరం, భైరవపట్నం, అప్పాపురం, లోకుమూడిలో స్వామివారి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.

480 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు

పామర్రు: వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలను నిర్వహించారు. స్థానిక ఎస్‌కే ఆర్ ఆర్ జెడ్పీ హైస్కూల్ లో చిన్నారులకు శుక్రవారం కంటి వైద్య పరీక్షల శిబిరం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ కంటి వైద్య నిపుణుడు డాక్టర్ రాంబాబు విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. ఈ పరీక్షల్లో 480 మంది విద్యార్థులు కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 23 మందికి కళ్ల జోళ్లు అవసరమని గుర్తించారు. ఆధార్ కార్డులు, ఐడీ కార్డులను తీసుకుని ఉన్నతాధి కారులకు పంపించారు. వీరికి త్వరలో కళ్లజోళ్లు అందిస్తామని కనుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు వంశీ కృష్ణ తెలిపారు. ఏఎన్‌ఎం వీ నాగమణి, ఆశాలు శ్రీదేవి, నందిని, పాఠశాల హెచ్‌ఎం ఏ ఇందిరా రాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా భూ హక్కు పత్రాలు

బార్లపూడి(మొవ్వ): జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్షలో భాగంగా మండలంలో రీ సర్వే పూర్తియిన గ్రామాల్లో పత్రాలను పంపిణీ చేసేందుకు అధికారులు సిద్ధం అవుతున్నారు. జగనన్న భూహక్కు, భూరక్ష 11 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తియిందని, వీటిలో బార్లపూడి, అవురిపూడి, చినముత్తేవి, అయ్యంకి, పెడసనగల్లు గ్రామాల్లో రీ సర్వే పూర్తియిందని మండల తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్ వెల్లడించారు. బార్లపూడిలో 178, అవురుపూడిలో 624 భూహక్కు పత్రాలు విడుదలవగా ఆయా రైతుల ఈకేవైసీకై వీఆర్‌వోలు ఎం.ఖాసీం, కొలుసు శ్రీనివాసరావు రైతుల వేలి ముద్రలు సేకరిస్తున్నారు.